## జనపథం - జనపదం

# స్వర్గం - నరకం

- నిత్యానంద్.

ఈసారి మన చర్చాంశము 'స్వర్గం - నరకం'. ఆగండాగండి! అప్పుడే 'రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమల నృత్యప్రదర్శన జరుగుతున్నట్లు, మీరు ముందు వరుసలో మెత్తని తివాచిపై కూర్చుని ప్రదర్శనను ఆశ్వాదిస్తున్నట్లు' ఏవేవో ఊహించుకోకండి. మనకు చిన్నప్పటినుండి నూరిపోసేది ఏమిటంటే - ఇప్పుడు కష్టపడితే రేపు సుఖపడవచ్చునని. అలాగే ఇలాతలంపై బ్రతికినంతకాలము కష్టపడైనా నీతిగా ఉంటే, ఆపై స్వర్గంలో కడుపులో చల్ల కదలకుండా (అక్కడ చల్ల దొరుకుతుందో! లేదో! అని బెంగపడకండి. చల్ల కాకపోతే - పోనీ అమృతమో, సురాపానమో అనుకుందాం!), పూచిక పుల్ల కదిపినంత పనికూడా చెయ్యనవసరములేకుండా సుఖభోగాలలో తేలవచ్చుననే భావన ఏనాడో మన మస్తిష్కంలో చోటుచేసుకుంది. అలాగే నరకము బారినపడితే కొరడాలతో దెబ్బలు, సలసల కాగే నూనెలో వేపుడు, ఉక్కు రంపములతో కోయడం అని విలవిలలాడేవారూ లేకపోలేదు. "స్వర్గసుఖాలు అనుభవించడానికి జీవితకాలమంతా కష్టబడడం ఎందుకు? ఆ స్వర్గసుఖాలేవో ఇక్కడే అనుభవించవచ్చు కదా!" అనేది ఓ మేధావి ప్రశ్న. నిజమే కదా!

వెనుకటికి ఓ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ రెండు చేతులా సంపాదించి (ఇది వెనుకటి సంగతి సుమండీ!), తన ఆఫీసుకు సెలవు పెట్టి, ఎంచక్కా ఓ నిర్మానుష్యముగా ఉన్న ద్వీపానికి పోయాడట. ఆ ద్వీపములో అతను చక్కగా ఊయలను ఏర్పరచుకుని, విశ్రాంతి తీసుకోడానికి సన్నద్ధమైన తరుణంలో అతనికి ఓ వల, బుట్ట పట్టుకుని వచ్చి, ప్రక్కన బెట్టి, చెట్టు నీడలో నడుము వాల్చబోతూ మరో ఆసామి కనిపించాడట. "ఏమబ్బాయ్! ఇక్కడ ఏమి చేస్తున్నావు? చేపలు పట్టడానికి వచ్చి, బద్ధకిస్తున్నట్లున్నావు." అని ప్రశ్నించాడట మన ప్రొఫెషనల్. అతను "ఔను. కాని చేపలు పడితే ఏమిటి లాభం?" అని అడుగగా, "నీకు కావలసినన్ని ఉంచుకుని, మిగిలినవి అమ్మి డబ్బులు సంపాదించవచ్చు" అన్నాడు ప్రొఫెషనల్. "డబ్బు సంపాదిస్తే?" ఆసామి ప్రశ్నార్థకముగా చూసేసరికి, మన ప్రొఫెషనల్ గారు "డబ్బు కూడబెట్టి ఓ పడవ కొనవచ్చు" అన్నారు. "కొంటే?" మళ్ళీ ఆసామి ప్రశ్న. "దానితో బోల్డన్ని చేపలు పట్టవచ్చు. బోలెడు డబ్బు సంపాదించవచ్చు. ఆనక పెద్ద నౌకను కూడా కొనవచ్చు. ఇలా వ్యాపారము వృద్ధిచేసుకోవచ్చు" అని సందేహనివృత్తి చేసాడు ప్రొఫెషనల్. "వృద్ధి చేసుకుంటే?" మరో సందేహం. "ఎంచక్కా నాలా హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు." అన్నాడు మన ప్రొఫెషనల్. "మరి నేను చేస్తున్నదదే కదా!" అని ఆసామి అనేసరికి మన ప్రొఫెసర్ గారికి జ్ఞానోదయమైంది.

ఇంతకీ ఈ స్వర్గ నరకాలు ఎక్కడున్నాయి? అసలు ఉన్నాయా? ఐదు పదులు పైబడిన ఓ వృద్ధురాలు (అమెరికాలో ఏభై సంవత్సరాలకే ఎవరినైనా వృద్ధులు అంటే ప్రమాదం. తస్మాత్ జాగ్రత్త.) ఆమె ఏమి చేస్తూ ఉంటుందోనని ప్రశ్నించేసరికి "రామా! కృష్ణా! అనుకుంటూ నాల్గు మంచి పనులు చేసి స్వర్గాన్ని చేరుకునే ప్రయత్నంలో ఉన్నాన"ని ఆమె సమాధానం. ఆధ్యాత్మిక చింతన అరవైలలోనే అవసరమని మనలో చాలా మంది నమ్మకము. "కాయగూరలు తిని కాషాయవస్త్రముల్ బోడి నెత్తిగల్గి బొరయుచుందురు తలలు బోడులైన తలపులు బోడులా" అని వేమన అన్నట్లు ఆ వయస్సులో సాధన చెయ్యడమూ కష్టమే! అనుభవజ్ఞుల బోధనలననుసరించి స్వర్గానికి వెళ్ళడానికి అంత కష్టపడనవసరం లేదు. అది మన ఆలోచనలలోను, ప్రవర్తన మీద ఆధారపడి ఉంది. నిశ్చలమైన మనస్సుతో మనము స్వర్గములోనే ఉన్నట్లు, మనకు అన్నీ సమృద్ధిగా సమకూరుతున్నట్లు, ఆనందపు అంచులలో తేలిపోతున్నట్లు మన మనసుకు తర్ఫీదునిస్తే స్వర్గానికి మనము వెళ్ళనవసరము లేదు. స్వర్గమే మన దగ్గరకు వస్తుంది. నిష్కామకర్మను ఆచరిస్తూ, అరిషడ్వర్గానికి ఆశ్రయము కల్పించకుండా, చేసే ప్రతి పనిని ఏకాగ్రతతో నెరవేరిస్తే, దానికి మించిన స్వర్గం ఏమిటి ఉంటుంది. గురజాడ అప్పారావుగారు "స్వంత లాభము కొంత మానుక పొరుగువారికి తోడు పడవోయ్" అని, భగవద్గీతలో శ్రీకృష్ణుడు "చేసే ప్రతి పనిని బ్రహ్మార్పణ బుద్ధితో చేయు"మని, ఇలా మన పూర్వీకులు అనేకులు అనేకరకములుగా ఇదే విషయాన్ని చెప్పడము జరిగింది. సుమతీ శతకకారుడన్నట్లు

"తనకోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దు:ఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!"

అన్నది అక్షర సత్యము. సరే మరి మన స్వర్గధామము తెరిచే ప్రయత్నము చేద్దామా!

---

**కొంగ జపం!**

కొంగ జపాన్ని కొట్టి పడెయ్యకండి.
ఒంటి కాలిపై నించోండి చూద్దాం! అబ్బో చాలాసేపు నించున్నారే!
సరే కళ్ళుమూసుకుని ఒంటికాలిపై నించోండి. చూసారా ఎంత కష్టమో!
పూర్వం మునులు అలా ఒంటికాలిపై - గంటలు, రోజులూ కాదు; సంవత్సరాలు తపస్సు చేసినట్లు చదువుకున్నాం. ఇదంతా చెప్పడంలో ఒక (ఉప)యోగం ఉంది.
మీకెప్పుడైనా విపరీతమైన కోపం వచ్చి ఒంటికాలిపై లేచే సమయములో ఒక్కసారి కళ్ళుమూసుకుని ఒకటి నుండి పది వరకు లెక్కపెట్టడం కాని, ఏదైనా మంత్రాన్ని ఉచ్ఛరించడముగాని చెయ్యండి. మీ జీవితములో అద్భుతాలు జరుగుతాయి.